# దుబ్బాక ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



దుబ్బాకలో బీఆర్ఎస్ నాయకుడు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దుబ్బాక ఎంపీడీవో భాస్కరశర్మ, కార్యాలయం సిబ్బంది, తదితరులు

దుబ్బాక, డిసెంబర్ 8: భారీ మెజార్టీతో గెలిచిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుక్రవారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. దుబ్బాక ఎంపీడీవో భాస్కరశర్మ, కార్యాలయ సిబ్బంది, వంద పడకల దవాఖాన వైద్య బృందం సిబ్బంది తదితరులు కలిసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొత్త కిషన్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుబ్బాకలో పలు వివాహ శుభకార్యాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దుబ్బాక మండలం చీకోడు బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి కూతురు వివాహంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆనంతరం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బందారం కిష్టాగౌడ్ కూతురు వివాహం, ఎనగుర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొయ్యడ అంజాగౌడ్ కూతురు వివాహాలకు ఎమ్మెల్యే హాజరై నూతన వధు వరులను ఆశీర్వదించారు. ఆయన వెంట దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రొట్టె రాజమౌళి, కిషన్‌రెడ్డి సురేశ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పెద్దగుండవెల్లి సర్పంచ్ రాజిరెడ్డికి పరామర్శ

దుబ్బాక మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, పెద్ద గుండవెల్లి సర్పంచ్ సద్ది రాజిరెడ్డికి మాతృవియోగం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి పెద్దగుండవెల్లికి చేరుకుని, రాజిరెడ్డి మాతృమూర్తి పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆనంతరం రాజి రెడ్డికి, వారి కుటుంబీకులకు ఎమ్మెల్యే తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, నాయకుడు కిషన్‌రెడ్డి



దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి సర్పంచ్ రాజిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# రూ.3 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

- కొడకంచి శివారులో తయారీ కేంద్రం ఏర్పాటు
- యాంటీ నార్కోటిక్ అధికారులు, జిన్నారం పోలీసులను అభినందించిన ఎస్పీ రూపేశ్

జిన్నారం, డిసెంబర్ 8: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలో రూ.3 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న ఘటన జిల్లాలో పెద్ద కలకలం రేపింది. శుక్రవారం జిన్నారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి ఎస్పీ సీహెచ్ రూపేశ్ వెల్లడించారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో నిషేధిత ప్రమాదకరమైన మత్తు పదార్థాలను తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు వీటిని తయారు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీ సీహెచ్ రూపేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరపట్ల గ్రామానికి చెందిన మహ్మద్ యూనీస్ అలియాస్ జక్కరాజు, హత్నూర మండలం గుండ్లమాచునూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్, సీ.శ్రీశైలం యాదవ్, జిన్నారం మండలం కొడకంచి గ్రామానికి చెందిన కిష్టంగారి శివశంకర్‌గౌడ్, కొడకంచి పంచాయతీ పుట్టగూడ గ్రామానికి చెందిన కిష్టంగారి నిర్మల్‌గౌడ్, పటాన్‌చెరు ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ల్యాబ్ రియాక్టర్ ఆపరేటర్, కెమిస్ట్ పసుపలేటి మాణిక్యాలరావు, అమీన్‌పూర్ బీరంగూడకు చెందిన రాహుల్‌రెడ్డి (ఏడుగురు)కలిసి సైకోట్రాపిక్ సబ్‌స్టాన్స్ అయిన నార్డాజెపం అనే నార్కోటిక్ డ్రగ్స్ తయారీ కోసం జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామ శివారులో 3.30 గుంటల భూమిలో ఉన్న జామతోటను, అందులోని షెడ్డును లీజుకు తీసుకుని ల్యాబ్ ఏర్పాటు చేశారు. మూడు నెలలుగా షెడ్డులో డ్రగ్స్ తయారీ జరుగుతున్నది. ఈ ప్రక్రియపై జిన్నారం పోలీసులు, టీఎస్ యాంటీ నార్కోటిక్ అధికారులకు సమాచారం రావడంతో వారు స్థావరంపై దాడి చేశారు. దాడుల్లో 14 కిలోల నార్డాజెపం అనే నార్కోటిక్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.70 లక్షలు ఉంటుంది. ఇది బహిరంగ మార్కెట్‌లో రూ.3 కోట్ల వరకు ఉంటుంది. డ్రగ్స్ తయారీ కేంద్రం నుంచి 14 కిలోల డ్రగ్స్‌తోపాటు ఇతర ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. షెడ్డులో ఏర్పాటు చేసిన రియాక్టర్, డ్రయ్యర్, ఇతర ప్రాసెసింగ్ సిస్టంను అక్కడే సీజ్ చేశారు. దీనికి ప్రధాన కారకులు మహ్మద్ యూనీస్ అలియాస్ జక్కరాజు, గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్, కిష్టంగారి నిర్మల్‌గౌడ్, పసుపులేటి మాణిక్యాలరావు, కిష్టంగారి శివశంకర్‌గౌడ్‌ను అరెస్టు చేశారు. రాహుల్‌రెడ్డి, సీ.శ్రీశైలంయాదవ్ పరారీలో ఉన్నారు.



మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ సీహెచ్ రూపేశ్

### ఇది ప్రమాదకరమైన డ్రగ్: ఎస్పీ

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డగ్స్ తయారీకి జామతోట, షెడ్డును లీజుకు తీసుకుని అందులో ల్యాబ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. షెడ్డులో సుమారు ఆరు ఫీట్ల గంత తవ్వి రియాక్టర్ పెట్టి, దానికి అవసరమైన ఎక్విప్‌మెంట్ బిగించారు. తయారు చేసిన ప్రొడక్ట్‌ను పొడిగా మార్చేందుకు డ్రయ్యర్‌ను ఏర్పాటుచేశారు. బైక్‌లపై అవసరమైన ముడిపదార్థాలు తీసుకొచ్చారు. దీనికంతటికి అవసరమయ్యే పరికరాలను రాహుల్‌రెడ్డి సమకూర్చాడు. పసుపులేటి మాణిక్యాలరావుకు కెమిస్ట్‌గా అనుభవం ఉంది. దీంతో అతను డ్రగ్స్ తయారు చేశాడు. ప్రస్తుత నార్డాజెపమ్ డ్రగ్‌ను మరింత ప్రాసెస్ చేస్తే అల్ప్రాజోమ్ డ్రగ్ తయారవుతుంది. ఇది ఒక గ్రామ్ రెండు వేల లీటర్ల కల్తీ కల్లులో కలుపుతారు. ఇది చాలా ప్రమాదకరమైన డ్రగ్. ఇది తీసుకుంటే మనుషుల ప్రాణాలకే ప్రమాదం. డ్రగ్స్ తయారీ కమర్షియల్ కిందకు వస్తుంది. వీరికి పెద్ద శిక్ష పడే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఇందులో మహ్మద్ యూనీస్‌కు పాత నేర చరిత్ర ఉంది. 2017లో అల్ప్రాజోన్ తయారీ కేసులో మూడేండ్లు జైల్లో ఉన్నాడు. గతంలో పసుపులేటి మాణిక్యాలరావు షాపూర్‌కు చెందిన కోటిరెడ్డి వెంకటేశ్వరరావుతో కలిసి బాలానగర్ ఏరియాలో అల్ప్రాజోన్ తయారు చేస్తూ ఉప్పల్ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడి 2020లో జైలుకు వెళ్లాడు. నిందితులను అరెస్టు చేసిన జిన్నారం సీఐ వేణుకుమార్, టీఎస్ యాంటీ నార్కోటిక్ అధికారులు జి.చక్రవర్తి, శ్రీధర్, పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, జిన్నారం ఎస్సై విజయరావు, ఇతర అధికారులను ఎస్పీ అభినందించారు.

### మత్తు పదార్థాలు, అక్రమ రవాణా అరికట్టాలి

సంగారెడ్డి కలెక్టరేట్: జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి నగేశ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోలీస్, వైద్యారోగ్య, ఎక్సైజ్, అటవీ, వ్యవసాయ, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, విద్య తదితర శాఖల అధికారులతో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం, అరికట్టడంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలను విద్యార్థులు, రైతులు, ప్రజలకు వివరించి, చైతన్యపర్చాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ జేడీ నర్సింహారావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




సికింద్రాబాద్ రైల్వే బోర్డు సమావేశంలో పాల్గొన్న సభ్యుడు షేక్ ఫరీద్

# బీదర్‌కు డెమో ఎలక్ట్రిక్ రైలు నడిపించాలి

## - సికింద్రాబాద్ రైల్వే బోర్డు సమావేశంలో సభ్యుడు షేక్ ఫరీద్

జహీరాబాద్, డిసెంబర్ 8: లింగంపల్లి నుంచి బీదర్ వరకు డెమో ఎలక్ట్రిక్ రైలు నడిపించాలని రైల్వే బోర్డు సభ్యుడు షేక్ ఫరీద్ కోరారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్వే భవనంలో నిర్వహించిన 169వ అడ్వయిజరీ బోర్డు సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ ఆదేశాల మేరకు కోహీర్ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించేందుకు నిధులు మంజూరు చేయాలని, లింగంపల్లి నుంచి డెమో ఎలక్ట్రిక్ రైలుకు అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. కోహీర్‌లో ప్రధాన రోడ్డుపై ఫ్లై ఓవర్ నిర్మించేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. లింగంపల్లి నుంచి బీదర్ వరకు డెమో రైలు నడిపేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని రైల్వే అధికారులు తెలిపారన్నారు. అమృత్ స్టేషన్‌గా జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో పనులు చేస్తున్నారని, వేగవంతం చేసేందుకు కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న గూడెం మహిపాల్‌రెడ్డి



తిరుమలలో స్వాములవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 8: పటాన్‌చెరు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన గూడెం మహిపాల్‌రెడ్డి తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్నారు. అనారోగ్యానికి గురైన మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం కోసం పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఆయనతో నియోజకవర్గ నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

# మంచి ఆలోచన జీవితాన్ని మారుస్తుంది

## కారు డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేసిన సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 8: మంచి ఆలోచనలు మనిషి జీవితాన్ని మారుస్తాయని, అవకాశాలను మనం అందిపుచ్చుకుని ముందడుగు వేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. స్థానిక కోటిలింగాల ఆలయంలో యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆర్థిక సహకారంతో నెల రోజులు నిర్వహించిన శిబిరంలో కారు డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తిచేసిన 35 మంది మహిళాలు, యువతులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ మనం నేర్చుకున్న పని జీవితంలో ఏదో ఒకరోజు తప్పకుండా ఉపయోగపడుతుందన్నారు. మహిళలు ఎవరి కాళ్ల మీద వారు నిలబడితే సమాజం గౌరవిస్తుందన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ వికాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, రాజలింగం, సిబ్బంది సజీమ్, నాగరాజు తదితరులు ఉన్నారు.



డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సీపీ శ్వేత